నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల, ఫిబ్రవరి 22 : మండల కేంద్రం లోని సబ్ స్టేషన్ పరిధిలో చీపురుదుబ్బ ఫీడర్ 11 కేవీ లైన్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం, శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. ఈ ఫీడర్ మరమ్మతులతో గురుడపేట, కన్నెపల్లి, బోదంపల్లి, కన్కి, యాపలగూడ, గ్రామాలకు సరఫరా ఉండదని తెలిపారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

ఆలయ కమిటీ నియామకం

రెబ్బెన, ఫిబ్రవరి 22: మండలంలోని గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతర సందర్భంగా తాత్కలిక కమిటీని నియమిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈవో బాపురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ సభ్యులుగా లెండుగురె గంటుమేర, మోర్లె తులసీరాం, అడప విమల, వనమాల స్వప్న, బొంగు నర్సింగరావు, తణుకు మురళీధర్, లోహ లక్ష్మణ్, లావుడ్య దుప్పానాయక్, లెండుగురె జయరాం, మోడెం రాజాగౌడ్, అంజలి దుర్గం, వడ్డె మల్లేశ్, చల్లూరి గంగయ్యను నియమించినట్లు పేర్కొన్నారు.

బోర్‌వెల్ ఏర్పాటు

రెబ్బెన, ఫిబ్రవరి 22: రెబ్బెన మండలం సింగల్‌గూడ గ్రామంలోని సేవాలాల్ ఆలయం వద్ద గురువారం కొత్త బోర్‌వెల్ ఏర్పాటుకు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించినట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లావుడ్య రమేశ్ తెలిపారు. నాయకులు మోడెం సుదర్శన్‌గౌడ్, మోడెం చిరంజీవిగౌడ్, గోగర్ల రాజేశ్, కిషన్‌నాయక్, జమ్మీ, ఇమ్రోజ్, లాల్‌సింగ్, బోర్‌లాల్, తదితరులున్నారు.

వందశాతం సాధించాలి

పుస్తకాలు చదివిస్తున్న హెచ్ఎం మధుకర్

జైనూర్,ఫిబ్రవరి 22: విద్యార్థులు పదో తరగతిలో వందశాతం మార్కులు సాధించాలని జడ్పీ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం జాదవ్ మధుకర్ అన్నారు. మండలంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో గురువారం విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెడ్మాస్టర్ జాదవ్ మధుకర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాల విద్యార్థుల ప్రగతి, హాజరు శాతాన్ని పెంచాలని ఆయన కోరారు. రూమ్ టూ రీడ్ వారు అందించిన కథల పుస్తకాలు విద్యార్థులతో నిత్యం చదివించాలని సూచించారు. రూమ్ టూ రీడ్ కాలేజ్ కో ఆర్డినేటర్ వెంకట లక్ష్మి, ఆర్పీ సాయి కిరణ్, హెచ్ఎం ఆత్రం దత్తు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మేకల కాపరికి తీవ్రగాయాలు

దహెగాం, ఫిబ్రవరి 22: మండలంలోని ఖర్జీ గ్రామానికి చెందిన మేకల కాపరి ఎల్కరి రాకేశ్ విద్యుదాఘాతంతో తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేకలు తప్పిపోయాయని, బుధవారం సాయంత్రం తనతో పాటు గ్రామానికి చెందిన మరో ముగ్గురు కలిసి గ్రామ సమీపంలోని పత్తి చేలల్లో వెతకడానికి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తు తెలియన వ్యక్తులు వన్య ప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ వైరు తగిలి అక్కడికక్కడే పడిపోయాడు. వెంటనే మిగతా వారు గ్రామస్తులకు సమాచారం అందించారు. రాకేశ్‌ను అంబులెన్స్‌లో మంచిర్యాలకు తరలించి అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ప్రస్తుతం ఎంజీఎంలో వైద్యం పొందుతున్నప్పటికీ పరిస్థితి విషమంగా ఉందని సమాచారం, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయంపై ఎస్ఐ సనత్‌కుమార్‌ను సంప్రదించగా, తనకు ఇంతవరకు ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

జయప్రదం చేయండి

దహెగాం,ఫిబ్రవరి 22: మండలంలోని బీబ్రా గ్రామంలో ఈ నెల 24న నిర్వహించే జాతర వేడుకలను జయప్రదం చేయాలని దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వర సహిత సద్గురు సాయినాథ దేవాలయం వద్ద వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

తమ్మినేనిని కలిసిన నాయకులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 22: భారత కమ్యునిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కార్యదర్శి తమ్మనేని వీరభద్రంను జిల్లా నాయకులు కలిశారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న విస్తృత స్థాయి సమావేశంలో నాయకులు వీరభద్రంని కలిసి ఆరోగ్య పరస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్ పాల్గొన్నారు.

వనం నుంచి జనంలోకి..

- కొలువుదీరిన సమక్క తల్లి
- గద్దెలపై ప్రత్యేక పూజలు
- మొక్కులు చెల్లించిన భక్తులు

దేవులగూడ సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

రెబ్బెన, ఫిబ్రవరి 22: మండలంలోని గంగాపూర్ గ్రామ శివారులో ఉన్న గద్దెలు, పల్లవి ఫ్యాక్టరీ వెనుక ఉన్న దేవులగూడ గద్దెలు, నక్కలగూడ గ్రామంలోని గద్దెలతో పాటు పలు ప్రాంతాల్లో వనదేవతల జాతర బుధవారం ప్రారంభమైంది. బుధవారం సారలమ్మ తల్లి, గురువారం రోజున సమ్మక్క తల్లి గద్దెలపై కొలువుదీరారు. పూజారులు గొల్లపెల్లి సత్తమ్మ, దేవర వినోద్, ఇగురపు స్వామి ఆధ్వర్యంలో సమ్మక్కతల్లిని భాజభజంత్రీల నడుమ తీసుకవచ్చి గద్దెపై ప్రతిష్ఠించి పూజలు చేశారు. పడిగిద్ద రాజు, గోవిందరాజులను గద్దెలపై తీసుకవచ్చారు. శివసత్తులు పూనకాలతో, భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు. దేవులగూడ తల్లుల గద్దెల వద్ద మాజీ ఎమ్మెల్యే అత్రం సక్కు, పలువురు ప్రజాప్రతినిధులు మొక్కులు చెల్లించుకున్నారు.

గంగాపూర్ గ్రామశివారులోని సమ్మక్కను గద్దె వద్దకు తీసుకువస్తున్న భక్తులు

బెజ్జూర్‌లో..

బెజ్జూర్, ఫిబ్రవరి 22: మండలంలోని సోమిని ప్రాణహిత ఒడ్డున తెల్లరాపు గుట్ట అటవీ ప్రాంతంలో నిర్వహించిన సమ్మక్క సారలమ్మ జాతర గురువారం ముగిసింది. దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. గిరిజన సంప్రదాయాలతో ప్రత్యేక పూజలు చేశారు. జడ్పీటీసీ పంద్రం పుష్పలత, ఎస్ఐ విక్రమ్ సమ్మక్క సారలమ్మను దర్శించుకున్నారు.

బెజ్జూర్ : సమ్మక్క సారలమ్మ కు మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

రోగులకు మెరుగైన సేవలందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- ప్రభుత్వ దవాఖాన తనిఖీ

మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

వాంకిడి, ఫిబ్రవరి 22: దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను గురువారం ఆమె తనిఖీ చేశారు. దవాఖానలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, నిల్వ ఉన్న మందులు వివరాలను డాక్టర్ వినయ్‌ను అడిగి తెలుసుకున్నారు. దవాఖాన పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. అనంతరం వాంకిడి, బంబార గిరిజన బాల, బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి అందిస్తున్న భోజన వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని, చదువులో వెనుకంజలో ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి పందశాతం ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఆర్.రమాదేవి, పాఠశాలల హెచ్ ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఐటీడీఏ పీవో

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 22: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పీవో ఖుష్బూ గుప్తా గురువారం కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ రావును కలిశారు. కలెక్టర్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సంఘాల బలోపేతానికి కృషి చేయాలి

-అడిషనల్ డీఆర్డీవో చరణ్

వాంకిడి, ఫిబ్రవరి 22: మండల సమాఖ్య మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలని డీఆర్డీవో చరణ్ అన్నారు. గురువారం ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన మండల సమాఖ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘం సభ్యులు బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి, సమాఖ్య అభివృద్ధికి సహకరించాలని కోరారు. అంతకు ముందు తేనె శుద్ధి కేంద్రాన్ని సందర్శించారు. తేనె సేకరణ, మార్కెటింగ్‌పై ఆరా తీశారు. డీపీఎంలు రామకృష్ణ, అన్నాజీ, ఏపీఎం మహేశ్, సీసీలు విఠల్, భీంరావు, వేణు, వాంకిడి మండల సమాఖ్య అధ్యక్షురాలు బెల్లాల తార, సంఘం మహిళలు తదితరులున్నారు.

జాతరకు రెండు రోజులు సెలవు ప్రకటించాలి

తిర్యాణి,ఫిబ్రవరి 22: శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు రెండు రోజులు సెలవు దినాలుగా ప్రకటించాలని తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయ సిబ్బందికి గురువారం వినతి పత్రం అందజేశారు. మండలంలోని కన్నేపల్లి పంచాయతీ పరిధిలోని అరటిపల్లి స్టేజీ వద్ద ఈ నెల 21 నుంచి 24 వరకు జాతర ఉత్సవాలు కొనసాగనున్నాయి. దీనిలో భాగంగా రెండు రోజుల పాటు సెలవు దినంగా ప్రకటిస్తే, ఇంటిల్లిపాది మొక్కులు చెల్లించుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గడలపల్లి ఎంపీటీసీ సారా రమేశ్ గౌడ్, తుడుందెబ్బ జిల్లా ప్రధానకార్యదర్శి సమ్మక్క, ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు వెడ్మ భగవంత రావు, మండలాధ్యక్షుడు తోడసం భాస్కర్, డివిజనల్ అధ్యక్షుడు గెడెం సుభాష్, మండల ప్రధాన కార్యదర్శి రాయిసిడాం వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మైనార్టీ పాఠశాల విద్యార్థిని అనారోగ్యంతో మృతి

-పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమే కారణం: కుటుంబ సభ్యులు

ఆసిఫాబాద్/వాంకిడి, ఫిబ్రవరి22: ఆసిఫాబాద్ మండలంలోని బాబాపూర్ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని షేక్ అంజూమ్ అనారోగ్యంతో మృతి చెందింది. నాలుగు రోజుల క్రితం విద్యార్థినికి జ్వరం వచ్చింది. దీంతో పాఠశాల సిబ్బంది మాత్రలు ఇచ్చారు. రెండు రోజులైనా తగ్గకపోవడంతో కుటుంబ సభ్యులకు బుధవారం సమాచారం ఇచ్చారు. దీంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం పెద్ద దవాఖానకు తరలించాలని సూచించారు. దీంతో మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు తలిస్తుండగా, మార్గమధ్యంలో అంజూమ్ మృతి చెందింది. తమ బిడ్డ మృతికి పాఠశాల సిబ్బందే కారణం, ఆరోగ్యం పూర్తిగా క్షీణించిన తరువాతే తమకు సమాచారం అందించారని విద్యార్థిని తండ్రి షేక్ కరీం ఆరోపించారు.

షేక్ అంజూమ్(ఫైల్)

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోండి

- డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి దివ్య

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 22: వేసవికాలంలో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి దివ్య అన్నారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, కాగజ్ నగర్, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్లు అంజయ్య, భుజంగ రావు తో కలిసి ఈ వీసిలో పాల్గొన్నారు. నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, వందశాతం పన్నులు వసూలు చేస్తామని తెలిపారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ జడ్పీ సీఈవో అనిల్ కుమార్

సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో అనిల్ కుమార్

కెరమెరి, ఫిబ్రవరి 22: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించేలా చూడాలని జడ్పీ సీఈవో అనిల్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను డిప్యూటీ సీఈవో లక్ష్మీనారాయణతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం అంతర్గత రోడ్లను మంజూరు చేసిందని, వాటిలో నాసిరకం లేకుండా శాశ్వతమైన రహదారులు నిర్మాణం జరిగేలా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. సంబంధిత శాఖ ఇంజనీర్ పర్యవేక్షణలో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంకు వచ్చిన జడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవోలను జడ్పీటీసీ సెడ్మాకి దుర్పతాబాయి, వైస్ ఎంపీపీ సయ్యద్ అబూల్ కలాం, ఎంపీడీవో కృష్ణారావులు శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ ప్రసాద్‌తో పాటు కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

- ఆదివాసీల జీవనశైలిపై ప్రొఫెసర్ ఉష అధ్యయనం

కల్లేగాం గ్రామంలో ఆదివాసీలతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఉషా

కెరమెరి, ఫిబ్రవరి 22: రాజ్యాంగం కల్పించిన చట్టాలు, ఉన్న హక్కులను సద్వినియోగం చేసుకుంటూ ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రొఫెసర్ ఉష అన్నారు. ఆదివాసీల జీవన శైలిపై అధ్యయనం చేసేందుకు హైదరాబాద్ నుంచి వచ్చిన ఆమె, మండలంలోని కల్లేగాం, కొటారి, అంబరావుగూడ గ్రామాల్లో గురువారం సందర్శించారు. గోండ్వాన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో పర్యటించి ఆదివాసీ మహిళల స్థితిగతులు, మహిళ వ్యవసాయం, పోడు భూముల సమస్యలపై అడిగి వివరాలు సేకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయంతో పాటు అడవులు, అటవీ వనరులను సేకరించి అదనపు ఆదాయం పొందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోండ్వాన ఫౌండేషన్ చైర్మన్ సిడాం తిరుపతి, ప్రధాన కార్యదర్శి కుర్సెంగ మారుతి, సహయ కార్యదర్శి కోవ ఇందిర, ఫౌండేషన్ సభ్యుడు కుమ్రం బండేరావ్, ఆదివాసులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపైరాస్తారోకో చేస్తున్న మాలి సంఘం నాయకులు

కఠినంగా శిక్షించాలి

వాంకిడి, ఫిబ్రవరి 22: మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని బోరంపల్లి గ్రామంలో పూలే దంపతుల విగ్రహాలను ధ్వంసం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుర్నులే నారాయణ డిమాండ్ చేశారు. విగ్రహాలను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని 363జాతీయ రహదారిపై గురువారం బైఠాయించారు. నిందితులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో మాలీ సంక్షేమ సంఘం డివిజన్, మండల నాయకులు వాడై బాపురావు, మెంగాజీ, సుధాకర్, అశోక్, పోచ్చయ్య, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

నేటి నుంచి గంగాపూర్ జాతర

- బాలాజీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి తరలిరానున్న భక్తులు
- ఈ నెల 25 వరకు వివిధ కార్యక్రమాలు
- 23న స్వామి కల్యాణం, 24న జాతర, శ్రీ బాలాజీ రథోత్సవం

స్వామి వారి విగ్రహం

రెబ్బెన, ఫిబ్రవరి 22: మండలంలోని గంగాపూర్ గ్రామ శివారులోని శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ జాతర శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. మాఘశుద్ధ పౌర్ణమి రోజున శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతరకు సుమారు లక్ష మంది వరకు భక్తులు తరలివస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలు, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి, స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. గంగాపూర్ జాతర మూడు రోజుల పాటు కొనసాగుతుంది. ఈ నెల 25 వరకు నిర్వహించే జాతరలో 23న స్వామి వారి కల్యాణం, 24న రథోత్సవం, 25న మొక్కులు చెల్లింపులు ఉంటాయి. జాతరలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉండడం కోసం ఆలయ కమిటీ, స్వచ్ఛంద సంస్థలు సౌకర్యాలు ఏర్పాటు చేస్తారు. శ్రీ బాలాజీ ఆలయానికి ఆనుకొని ప్రవహిస్తున్న వాగులో నీరు మూడు కాలాల్లో ప్రవహిస్తూ ఉంటుంది. రెండో తిరుపతిగా ప్రసిద్ధి వందల ఏండ్ల క్రితమే గంగాపూర్ గ్రామ శివారులో వెలిసిన శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం వందల ఏళ్లకు పూర్వమే వెలిసినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. భక్తులు గంగాపూర్ శ్రీ బాలాజీని రెండో టీటీడీగా భావిస్తుంటారు. మాఘశుద్ధ పౌర్ణమి రోజున తిరుమలలో ఆలయం కొన్ని గడియల పాటు మూసి ఉంచుతారు. అదే సమయంలో గంగాపూర్ శ్రీ బాలాజీ ఆలయంలో వేంకటేశ్వరుడు కొలువుదీరుతాడని భక్తుల నమ్మకం. ఈ ఆలయాన్ని 13వ శతాబ్దానికి ముందు గంగాపూర్‌కు చెందిన విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన ఉమ్మడి పోతాజీ నిర్మించినట్లు తెలుస్తున్నది. ఈ కారణంగానే ఆలయం ఎదుట పోతాజీ సమాధి ఉంటుంది. ప్రకృతి ఒడిలో ఒదిగినట్లు ఈ ఆలయ పరిసరాలు ఉంటాయి. ఆలయానికి ఆనుకొని ప్రవహిస్తున్న వాగులో నీరు ఎల్లకాలం ఉంటుంది.

గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం

ఇబ్బందుల్లేకుండా చర్యలు

నేటి నుంచి 25వ తేదీ వరకు జరిగే జాతర జరుగుతుంది. భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటాం. ఎండ నుంచి రక్షణ కోసం టెంట్లు వేయడంతో పాటు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తాం. అందరి సహకారంతో జాతర విజయవంతం చేస్తాం. ఏటా ఇక్కడ జాతరకు సుమారు లక్ష వరకు భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుంటారు. ఈ ఏడాది కూడా చాలా మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది.

-బాపురెడ్డి, ఆలయ ఈవో

సింగరేణి

ఘనంగా 'వరల్డ్ థింకింగ్ డే'

బెడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఏజీఎం, పీఎం

రెబ్బెన, ఫిబ్రవరి 22: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లో ఉన్న సింగరేణి ఉన్నత పాఠశాలలో గురువారం వరల్డ్ థింకింగ్ డే(ప్రపంచ ఆలోచన దినోత్సవం) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా ఏజీఎం తిరుమల్‌రావు ముందుగా భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ పతకం ఆవిష్కరించి, ఫౌండర్ బెడెన్‌పావెల్ చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం శాంతి ర్యాలీ, ప్రగతి ర్యాలీ జెండా ఊపి ప్రారంభించారు. మత గురువులు, విద్యార్థులతో కలిసి సర్వమత ప్రార్థనలు నిర్వహించిన అనంతరం మాట్లాడారు. బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీవో ప్రశాంత్, ఇన్‌చార్జి హెచ్ఎం బాలూనాయక్, డిస్ట్రిక్ట్ కెప్టెన్ సృజన, స్కౌట్ మాస్టర్ భాస్కర్, తదితరులున్నారు.

బెల్లంపల్లి ఏరియాలో డైరెక్టర్ల పర్యటన

రెబ్బెన, ఫిబ్రవరి 22 : బెల్లంపల్లి ఏరియాలో గురువారం సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంవోఈఎఫ్ (ఐఆర్‌వో హైద్రాబాద్ కార్యాలయం) డైరెక్టర్ తరుణ్ పర్యటించినట్లు పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి ఖైర్‌గూడ ఓసీపీలోని క్యారీకి వెళ్లి పనులు పరిశీలించి, ఏరియా ఉన్నతాధికారులతో రివ్యూ నిర్వహించి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై చర్చించి పలు సలహాలు, సూచనలు అందించారు. ఎంవోఈఎఫ్ డైరక్టర్ తరుణ్ ఖైర్‌గూడ ఓసీపీ లోని పర్యావరణాన్ని పరిశీలించి, పలు సలహాలు సూచనలు అందించారు. ఏరియా జీఎం రవిప్రసాద్, కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ జీఎం జేవీఎల్ గణపతి, కార్పొరేట్ అడిషనల్ మేనేజర్లు రవికిరణ్, శ్రీనివాస్, ఖైర్‌గూడ పీవో సత్యనారాయణ, మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్, ఎన్విరాన్‌మెంట్ అధికారులు హరీశ్, సూర్యనారాయణ, తదితరులున్నారు.

పారదర్శకత లేదని మహిళల ధర్నా

గురుకుల బాలికల పాఠశాల ముందు ధర్నా చేస్తున్న మహిళలు

రెబ్బెన, ఫిబ్రవరి 22: రెబ్బెనలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో మహిళా వాచ్‌మెన్ పోస్టును పారదర్శకంగా భర్తీ చేయలేదని, దరఖాస్తుదారులు గురువారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపిక చేసిన అభ్యర్థిని విధుల్లో నుంచి తొలగించి, పారదర్శంగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ జ్యోతిని వివరణ కోరగా పై అధికారుల నుంచి వచ్చిన అదేశాల మేరకు విధుల్లో తీసుకున్నామని, ఈ మేరకు గురువారం కలెక్టర్ ను కలిసి విషయం తెలియజేసినట్లు చెప్పారు.

రోడ్డు పనుల అడ్డగింత

రోడ్డు పనులను అడ్డుకోవడంతో ఆందోళనకు దిగిన గ్రామస్తులు

లింగాపూర్,ఫిబ్రవరి 22: మండలంలోని చిన్నదాంపూర్ గ్రామ పంచాయతీ పరిదిలోని పుల్సింగ్ నాయక్ తండా గ్రామంలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. దీంతో గ్రామస్తులు వాగ్వాదానికి దిగి, ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న జైనూర్ సీఐ అంజయ్య, తహసీల్దార్ రాజేంద్ర ప్రసాద్ అక్కడికి చేరుకున్నారు. అటవీ శాఖ అధికారులతో మాట్లాడారు. ఈ భూమి అటవీ పరిధిలోకి రాదని, రెవెన్యూ పరిధిలో ఉందని మ్యాపు ద్వారా అటవీ శాఖ సిబ్బందికి సూచించారు. అయితే అధికారికంగా అనుమతులు వచ్చేంత వరకు ఈ పనులు సాగనివ్వబోమని అటవీ శాఖ అధికారులు తేల్చిచెప్పారు. దీంతో ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని అధికారులు గ్రామస్తులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

25 నుంచి క్రికెట్ టోర్నమెంట్

రెబ్బెన, ఫిబ్రవరి 22: మండలంలోని గోలేటిటౌన్‌షిప్‌లో ఉన్న శ్రీ భీమన్న క్రీడా మైదానంలో ఈ నెల 25వ తేదీ నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి జ్యోత్స్న క్రికెట్ కప్ టోర్నమెంట్ ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకుడు గంగిశెట్టి సురేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. లీగ్ పద్ధతిలో జరిగే క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లు, పూర్తి వివరాల కోసం 9701181820 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఇబ్బందుల్లేకుండా చూడండి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్‌కుమార్
- గంగాపూర్ జాతర పనుల పరిశీలన

ఎస్పీ , డీఎస్పీని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రెబ్బెన, ఫిబ్రవరి 22: మ